# తెగిన గాలిపటం

అమలాపురం పెళ్ళికి పోయినప్పుడు అకస్మాత్తుగా వెంకట్రావు కనపడ్డాడు. వాణ్ణిచూసి రమారమి పదేళ్ళు కావస్తోంది. మొదట వాణ్ణి చూసి నోరు వెళ్ళబెట్టాను "నువ్వేంట్రా" అంటూ. వెంకట్రావు తెలుపు నలుపు మీసాల్లో నుంచి సన్నగా నవ్వాడు "నేనేరా అంటూ". వెంకట్రావు కనబడ్డంతో నా బాధ తగ్గిపోయింది. మధ్యాహ్నం రెండు గంటల దగ్గ ర్నుంచి దిక్కులు చూస్తున్నాను. కాలక్షేపం కాక కొట్టుకుంటున్నాను. కావల్సిన వారంతా పెళ్ళి హడావిడిలో వున్నారు. అపరిచితులతో గంటల తరబడి కాలం గడిపే చాకచక్యం నా దగ్గరలేదు. ఎలాగో పేపరుతో గంట కుస్తీ పట్టాను. అటు-ఇటు దిక్కులుచూస్తూ కొత్త జనాన్ని చూసి నిర్ఘాంత పోతున్న సన్నివేశంలో వెంకట్రావు రిక్షా దిగాడు."

తీర్థంలో తప్పిపోయిన పిల్లాడు కనిపించిన తండ్రిలా సంతోషించాను!

వెంకట్రావు లోపలకెళ్ళి అరగంట తర్వాత బయటికి వచ్చాడు. వీధరుగుమీది బల్లపై "బక జపం"చేస్తూ వెంకట్రావు కోసం చూస్తున్నా. నాలో ఆత్రం పెరిగేకొద్దీ, వెంకట్రావు ఆలస్యం పెరిగింది. పెట్రోమాక్స్ లైట్లు వెలిగిస్తున్న ముసలి సాహేబుని, పెళ్ళి వేదికకు రంగుల తోరణాలు కడుతున్న అమ్మాయిల్ని, వీరణాన్ని మోగిస్తున్న గురవయ్యాని, ఉత్సా హంగా సాగిపోతున్న పదమూడు ముక్కల ఆటని చూడటం నా వంత యింది. అసలే వెంకట్రావు కబుర్లపోగు. ఎంత కొత్త వ్యక్తి కనిపించినా మాటలతో కాలక్షేపం చెయ్యగలడు.

అయితే అతగాడొచ్చి "ఇక్కడున్నావన్రా ... నీ కోసం గాడి పొయ్యిదగ్గర వెతికాను. నువ్వు పెళ్ళిళ్ళకొస్తే అక్కడే కదా మకాం వేసేది" పాత జ్ఞాపకాలమీద జోక్ చేశాడు.

"నీలాంటి వాళ్ళకి దగ్గరగా వుండని మానేశాను."

ఇద్దరం నడుస్తున్నాం. సందు చివరి కొచ్చాక "బజారుకు పోదామా?" అన్నాను. నామాట వినిపోతున్న రిక్షావాడు ఆగాడు.

"వెంకట్రావ్ యోగిలా రెండు క్షణాలు మౌనం వహించి, "ఇలా పొలాలకేసి పోదాం.... చల్లటి గాలివేస్తుంది" అన్నాడు.

మట్టిరోడ్డు దిగేదాకా వెంకట్రావు మాట్లాడలేదు. చాలా గంభీరంగా వున్నాడు. అతణ్ణిచూసి నేనూ మౌనం వహించాను.

ప్రజాసేవలో అలసిపోయిన వ్యక్తిలా సూర్యుడు చల్లబడిపోయాడు. చిట్లిపోయిన ఎర్ర గాజుల్లా మేఘాలు వ్రేలాడుతున్నాయి. గాలికి చెట్లు లయబద్ధంగా వూగుతూ సంధ్యాదేవికి వింఝామరాలు వీస్తున్నాయి.

పొలంమీద నుంచి చల్లటిగాలి వస్తున్నది. గడ్డి కోస్తున్న బల మైన పడుచులు, గట్లమీద పరిగెత్తే పశువులూ, రివ్వుమని ఎగిరిపోయే పిట్టలూ .. మా అలసటని దూరం చేశాయనే చెప్పాలి.

మెత్తటి పచ్చికమీద యిద్దరం కూర్చున్నాం. వెంకట్రావు సిగరెట్ వెల్గించి, నాకోటి యివ్వబోగా "వద్దన్నాను".

"అదేం?"

"పొగత్రాగడం మానేశాను."

"ఐ. సీ... ఫైన్ ... కాని మాలాంటి వాళ్ళం వదలలేకపోతున్నాం."

నవ్వాను "మీలాంటి పెద్ద పర్సు వాళ్ళు శపథాలు చెయ్యకూడదురా చిట్టీ.... సిగరెట్ యిండస్ట్రీ దెబ్బతింటుంది... విదేశమారకం, లక్షలాది కార్మిక కుటుంబాలు...."

నా సంభాషణ ఆగేలోగా "మైగాడ్"! ఇక్కడ కూడా పొలిటిక్స్ మాట్లాడకు. వ్యక్తిగత సమస్యలకే తల్లక్రిందులై పోతున్నాము ....

సామాజిక సమస్యలు మన కెందుకు ?... చూశావా ! ఈ సమస్యలన్నీ ఆలోచిస్తూంటే నా తల నెరిసిపోతుంది." వెంకట్రావు జోక్యం కలుగ జేసుకున్నాడు.

ఆ మాట నిజమే. వెంకట్రావు వయసుకి మించిన వార్ధక్యంలో కనిపిస్తున్నాడు. మనిషి విపరీతంగా విసిగిపోతే వార్ధక్యం తొందరగా రావచ్చునన్న సిద్ధాంతాన్ని ఎక్కడో చదివాను. కాని నాకు తెలిసినంతలో వెంకట్రావుకి అటువంటి సమస్యలేం లేవు. బంగారం పండే పాతిక ఎక రాల మాగాణీ, వడ్డీవ్యాపారం, వ్యాపారాలలో వాటాలు అతడ్ని లక్ష్మీ పుత్రుడ్ని చేశాయి. కేవలం డబ్బు అన్ని సమస్యలకి పరిష్కారం కాదన్న విషయం ఒప్పుకుంటాను. కాని ప్రాధమిక జీవితావసరాల్ని అది సమ కూరుస్తుంది. దానిమీద జీవితాన్ని నిలబెట్టుకునే సాహసం, చొరవా వ్యక్తి త్వాన్ని విస్తృత పరచుకుందామన్న జిజ్ఞాస కూడ అప్పుడే వస్తుంది. ఈ ప్రాధమిక అదృష్టాలకి కూడ నోచుకోలేని నిర్భాగ్యులు ఈ దేశంలో లక్షలమంది వున్నారు— వాళ్ళ బ్రతుకు ఒక పోరాటం ఒక ట్రాజడీ ....ఒక వారసత్వం.... అలాంటి వ్యక్తి కాదే వెంకట్రావు.... అయినా ఎనిమిదేళ్ళలో పరిస్థితులు మారేయేమో !

"ఆర్థికంగా దెబ్బతిన్నావా వెంకట్రావ్?" అడుగుదామనుకున్నాను. కాని ఆగిపోయాను. అసమంజసంగా తోచింది.

వెంకట్రావు మోచేతులమీద పడుకున్నాడు. అసలే పచ్చటి మనిషి. మెడలో పులిగోరు పతకం, ఖరీదైన వాచీ. బట్టలు - అతడి జీవితాన్ని ఉన్నంతగా ఊహించడానికి దోహదం చేస్తున్నాయి....

"రాజా! చెప్పరా నీ విశేషాలు .... ఎనిమిదేళ్ళ తర్వాత కలుస్తు కున్నాం .... ఏ మాటలే లేవా ?"

గుడి దగ్గరయ్యేకొద్దీ భక్తి దూరమవుతున్నట్లు, అకస్మాత్తుగా చానాళ్ళ తర్వాత కల్సుకుంటే ఏం మాట్లాడగలం? కాలం తన ప్రభావాన్ని చూపుతున్నాను సుమా అంటుంది. సంకోచం, అనుమానం ఎదురవుతాయి. కాలం తవ్విన గోతుల్లోంచి పైకి రావడం ఎంతో శ్రమ. నిత్యం పరిచయ మయ్యే వాళ్ళకీ బాధలేదు. గాలి పోగుచేసుకుని మాట్లాడు కుంటారు.

లజ్జత వుండదు. ఏ విషయం ఎప్పుడు మాట్లాడదామన్న భీతి వుండదు.

సంక్షిప్తంగా నా వివరాలు చెప్పాను.

"అదృష్టవంతుడివిరా! రిటయిరయి విశ్రాంతిగా వున్నావు. ఉన్న ఒక్కడూ మగ కుర్రాడు కనుక పెళ్ళి విషయంలో కూడా యిబ్బందిలేదు. అన్నట్టు ఎక్కడవుంటున్నాడన్నావ్ ...."

"మద్రాసులో .... కాసింజీభాయ్ టెక్స్‌టయిల్స్‌లో ఎకవుంటెంటుగా వుంటున్నాడు రెండేళ్ళనుంచి."

వెంకట్రావు బరువుగా నిట్టూర్చడం గుర్తించకపోలేదు.

"అంతేరా .... దేనికయినా పెట్టిపుట్టాలి. అదృష్టాన్ని మీదేసుకుని తిరుగుదామంటే మనిష్టమా ?" అంటూ వెంకట్రావు లేచి కూర్చున్నాడు. సిగరెట్ మరోటి వెలిగించి, "నిన్ను బోర్‌కొట్టడంలేదుకదా !" అన్నాడు.

లేదన్నట్లు తలూపాను.

"ఇన్నాళ్ళ నుంచీ నాలో పేరుకున్న చీకటి, అశాంతి నిన్ను చూడ గానే ఒక్కసారి బయట కొస్తున్నాయి. దాన్నిబట్టి నీ ఆత్మీయతపై ఎంత గౌరవముందో వేరే చెప్పనక్కర్లేదనుకుంటాను. ఇన్నాళ్ళు నిన్ను కలుస్తుందామని ప్రయత్నించి, బద్ధకించాను. నువ్వూ ఉత్తరాలు రాయవుకదా ! నీ అడ్రస్ సరిగ్గా తెలియక పోవడం ముఖ్యకారణం...."

క్షమించమన్నట్లు చూశాను.

"నాకు తెల్సురాజా. యాంత్రికమైన జీవితంలో మనం ఎన్నో మరచి పోతున్నాం. జ్ఞాపకం వున్నా పరిస్థితుల వలలో నుంచి తప్పించు కోవడం కష్టమవుతున్నది. ఇది మనం చేస్తున్న తప్పు కాకపోయినా మనకి అంటగడుతున్న తప్పు. నిన్ను వేలెత్తి చూపడం నా అభిమతం కాదు. నేను పెంచుకున్న నిరాశ, సరియైన దారి వెతుక్కోలేక, ఆత్మీయత పంచు కునే మనిషిని గుర్తించలేని అసమర్థత్వం వల్ల విడిచే నిట్టూర్పు యిది...."

చీకటి నల్లనల్లగా కురుస్తోంది. పొలం పరిసరాలు నిశ్శబ్దాన్ని స్వీకరిస్తూ, ఆకాశంలో వెలిగే నక్షత్రాలకేసి దిగాలుగా చూస్తున్నాయి

ఎదురుగావున్న సర్వీ తోటల సన్నని సంగీతం, దూరంగా నడుస్తున్న రెండెడ్ల బండిచప్పుడూ ఒక విధమైన జీవాన్నిస్తున్నాయి. వంకర చంద్రుడి వెన్నెల చీకట్లో కలిసిపోతున్నది.

"పోదామా?" అన్నాను.

"ఏం అప్పుడే పెళ్ళి భోజనంకేసి మనసు లాగుతోందేమిటి." చీకట్లో వెంకట్రావు నవ్వు స్పష్టంగా చూశాను.

"అబ్బే.... చీకటిపడిందని ..."

"ఫర్వాలేదు. ఆ కనిపి చేదే రోడ్డు. రోడ్డెక్కితే పది నిమిషాలే"

వెంకట్రావులో యింకా వుందామన్న జిజ్ఞాస కనపడింది. నాకూ మరో ఉద్దేశ్యం, వ్యవహారం లేవు. ఏదయినా పురుగూ, పుట్రా వుంటాయని తప్ప.

"మీ సూరిబాబు ఏంచేస్తున్నాడు? రెండు మూడేళ్ళ క్రిందట ఏలూరులో కనపడ్డాడు."

వెంకట్రావు చప్పున లేచి నిలబడ్డాడు. "నడు.... పోదాం."

ఆతడి ప్రవర్తన అక్కజమయింది. ఇదేం మనిషి? కొడుకుసంగతి ఎత్తగానే అలామారి పోయాడేమిటి? ఏదయినా యిద్దరికీ స్పర్ధ లున్నవా? రకరకాల ప్రశ్నలుదయించినవి.

రోడ్డుమీదకొచ్చాం. మున్సిపాలిటీ దీపాలు కొంతి దేవతల్లా వెలుగుతున్నాయి. వెంకట్రావు నా భుజం మీద చెయ్యి వేశాడు. "రాజూ! నాగురించి ఒక్కముక్క చెబితే నీ కర్థంకాదు. ఎన్నెన్నో చెప్పాలి. స్థూలంగా చెప్పుదామన్నా అవకాశంలేదు. దయవుంచి రెండుమూడు నెలలు వుండేలా మా వూరు రా. నాక్కాస్త సలహా యివ్వు. అంతే చాలు."

"తప్పకుండా"

"మాటంటే సరిపోదు రావాలి. ఎలాగా నీకు బరువు బాధ్యతలు లేవు. అంచేత నా కోసం కొంతకాలం స్పేర్ చెయ్యి. నీ యిన్స్పిరేషన్‌తో కొత్త ఉత్సాహాన్ని తెచ్చుకో డానికి ప్రయత్నిస్తాను. హెల్ప్ మి!"

కంఠం నిరాశ వర్షించింది. వెంకట్రావు మీద జాలి, ప్రేమ ఉబ్బొంగినయి. స్నేహం కోసం అతడి మనసు ఎంత కలవరిస్తుందో తెలుస్తోంది. "తప్పకుండా వెంకట్రావ్. మనం బాల్య స్నేహితులం- ఇద్దరం జీవితం కోసం రెండు వైపులకి విడిపోయినా, మైత్రీ వ్యవస్థలో మార్పులేదు. నేను నీకు నావైపు నుంచి ఎలాంటి సహాయమన్నా యిస్తాను. నీలో రేగుతున్న అశాంతికి పరిష్కారం కనుక్కుంటాను" స్నేహంలో తడిసిన నా మనస్సు నన్ను కిర్రుకిర్రి బిక్కిరి చేసింది.

తెల్లవారు ఝామున పెళ్ళవగానే వెంటనే బస్సందుకున్నాను. ఇరవై రోజులు గడిచినయి.

* * *

నా పొలెం ప్రయాణం అంత కంతకు ముందుకు పోతున్నది. నాలుగయిదుసార్లు ప్రయాణ మయ్యాను. కాని ఏదో అడ్డం ఎదురయింది. నా ఆలశ్యానికి కారణం వివరించమంటూ వెంకట్రావు రెండు ఉత్తరాలు టెలిగ్రాం పంపించాడు. ఈ తాకిడికి తట్టుకోలేక ప్రయాణమయ్యాను.

"అదేమిటి? ఇప్పుడు సంచారానికి బయలు దేరితే ఎలా? ఆ రాజమండ్రీ సంబంధం వాళ్లు కబుర్లు పంపిస్తున్నారాయిరి" వెళ్లేందుకు వీల్లేదన్నట్లు కారణాలు చూపింది కమల.

"చూడు కమలా! మనవాడు ఒకటి రెండు నెలలు దాకా సెలవిచ్చే ప్రయత్నం లేదని రాశాడా? వాడు లేకుండా మనం ఎన్ని ప్రయత్నాలు చేస్తే మాత్రం ఏం.? వాడొచ్చి 'కాదు పొమ్మంటే'! అంచేత వాడ్ని రానీ. ఈ లోగా వెంకట్రావు విషయం చూసి వస్తాను."

కమల ఒప్పుకున్నట్లు కనపడింది.

"నువ్వుకూడా రా రాదూ!"

"మీ స్నేహితుడాయె. మిమ్మల్ని పిలిచాడు. నేనేం విధాయకం. కమల మూతి వంకర్లు తిప్పింది. పారిపోతున్న యవ్వనచ్ఛాయల్లో తిరిగి నాకా నాటి కమల కనబడింది.

"నీ యిష్టం మరి—నాకు పర్మిషన్ వచ్చినట్లేనా?" నవ్వుతూ అడిగాను కమలని.

"అక్కడికి అన్నీ నన్ను అడిగి చేస్తున్నట్లు సిగ్గులేక పోతేసరి" కయ్యానికి కాలుదువ్వింది. కమలని రెచ్చగొట్టడం నాకు బలే సరదా.

"సిగ్గా! అది నాకెందుకు, నీలాంటి వాళ్ళకికానీ! స్త్రీకి సిగ్గు అవసరం అని మా వెంకటప్పయ్య వెయ్యి పేజీల పుస్తకం రాశాడు. వచ్చేటప్పుడు పట్టుకొచ్చి రోజూ చదివి వినిపిస్తా .."

అక్కడ ఉంటే పాపమన్నట్లు కమల లోపలికి వెళ్ళిపోయింది.

పాలెం రోడ్డు మీద బస్సు దిగేసరికి తూర్పు ఎర్ర బడుతోంది. నాగరికత పూర్తిగా స్వీకరించక పోయినా, నేర్చుకుంటున్న లక్షణాలు కన్పిస్తున్నాయి. రోడ్డుకి రెండు వైపులా పది పన్నెండు పాకలున్నాయి. అన్నీ ఒకే పరిమాణంలో లేకపోయినా, ఒకటే ప్రమాణం. బస్సు ఆగి నప్పుడే అక్కడ కాస్త చైతన్యం కనబడుతుందేమో!

పాలెం వూరు మైలున్నర వుందని సైన్ బోర్డు వల్ల గ్రహించాను. కాని వెళ్లేందుకు రిక్షా బండి కనబళ లేదు. రోడ్డు ప్రక్కన పెసరట్లు వేసే గళ్ళలుంగీ దగ్గర కెళ్లాను. "ఇక్కడ బళ్లేమీ దొరకవా" అంటూ.

గళ్ల లుంగీ సాదరంగా లేచి నిలబడ్డాడు. "రండి" అత్యంత గౌర వంగా ఆహ్వానించి ప్రక్కనున్న చెక్కబెంచీ తుడిచి కూర్చోమన్నాడు. ఇడ్లీ వేస్తున్న కుర్రాడిన్ని బండి కోసం పంపాడు.

గళ్ల లుంగీ వ్యక్తి నాలుగు యిడ్లెను రెండు పెసరట్లు అరటాకులో వేసి ఎదురుగా పెట్టాడు. వాటిని చూడగానే వాంతి వచ్చినట్లయింది.

వద్దన్నాను.

"అదేటిబాబూ. పల్లయ్య పెసరట్టు తింటే పదే పదే రావాల.... ఈ చుట్టు పక్కల మన పెసరట్టు కోసం ఎంత మంది వస్తారూ?" అంటూ వ్యాపార చిట్కా ప్రదర్శించాడు.

పూజ అయితే కాని ఏమీతినని అబద్ధం చెప్పాను. కాఫీ శుభ్రంగా చెయ్య మన్నాను.

గళ్లలుంగీ నిరాశ పడ్డాడనే చెప్పాలి.

జట్కా వచ్చింది పది నిముషాల్లో. ఎక్కుతూండగానే గుర్రం రంకె వేసింది. కంగారుగా క్రిందికి దిగాను. ఆ బండి ఎక్కడానికి భయం వేసింది. బండివాడు ముసలి వాడు. ఎలాగ వాడ్ని నమ్మి ఎక్కడం?

ఇద్దరు ముగ్గురు వచ్చి బండి పట్టుకున్నారు. నేను ఎక్కనంటున్నా బలవంతంగా ఎక్కించారు. పది గజాలు వెళ్లే దాకా బండి వాడు పరుగెత్తి తర్వాత ఎక్కాడు.

"ప్రొద్దుట కొత్త బాబయ్యా .. అలాగే ఏడిపిస్తాది" .... అన్నాడు.

బండి నిదానంగా వెళుతోంది. కాని నాకు లోపల భయంగానే వుంది. ప్రక్కనే పంట కాలువ ఇరుకు రోడ్డు.

నా అదృష్టం బాగుండి గుర్రం ఏం యిబ్బంది. పెట్టలేదు. బండి వూళ్ళోకి వచ్చి, చెరువు ప్రక్కనుంచి వెళుతోంది. ఇంతలో ఓ జీపు ఎదురయింది. పది గజాల్లో పోయి ఆగింది. వెంకట్రావు దగ్గరకి వస్తూ చప్పట్లు కొట్టాడు.... ....

"నువ్వట్రా .... ఉత్తరం రాస్తే బస్సు దగ్గరకి వచ్చేవాడ్ని కదా!"

"నీకు శ్రమ ఎందుకులే.... అయినా నీ యిల్లు తెల్సుకోలేక పోతానా?"

"అదా నీ ధీమా?"

"నీ కోసం వాళ్ళు చూస్తున్నారు ... వెళ్లిరా."

వెంకట్రావు జీపు దగ్గర కెళ్ళి వెంటనే వచ్చి నాతో బండి ఎక్కాడు.

"నా కోసం నీ పనులు మానుకోక."

"వాళ్లని ఎలా వదల్చుకోవాలాని చూస్తున్నాను. ... ఇంతలో దేముడిలా వచ్చావు నువ్వు."

బండి పాతమేడ ముందు ఆగింది.

* * *

నేను వచ్చి నాలుగు రోజులయింది. వెంకట్రావు యించుమించు యింటి దగ్గర లేడు. రాజకీయాల్లో తిరుగుతున్నాడు. నన్ను పిలిపించిన విషయం అతడు చెప్పలేదు. నాకు నేనుగా అడగడ మెందుకని వూరుకున్నాను. నాకు నిర్దేశించిన గదిలో విశ్రాంతిగా పడుకుని పుస్తకాలు చదువుకో సాగాను.

రంగయ్య గుమ్మం దగ్గరే వుండేవాడు .... నేనేం పని చెబుతానోనని.

"కావలిస్తే పిలుస్తాలే.... ఇక్కడే కూచోడ మెందుకు రంగయ్యా"

"బాబోయ్.... నేను కదిలితే పెదబాబుగారు చంపేస్తారు."

విశ్రాంతి కూడ ఎక్కువైతే చిరాకుగానే వుంటుంది. కాఫీ త్రాగి పుస్తకం తెరవ బోయాను. కాని తలనొప్పిగా వుంది.

క్రిందకి వచ్చాను.

"లీలమ్మ గారూ యిదిగో కాఫీ" రంగయ్య మెట్లకి ఎదురుగా వున్న గదిలోకి వెళుతున్నాడు.

లీల నన్నుచూసి మందహాసం చేసి "రండి బాబయ్య గారూ.... మీరు వచ్చారని రంగయ్య చెప్పాడు. బట్టలు మార్చుకుని వద్దామనుకుంటున్నాను" అంది కలుపుగోరు తనంగా.

"వూరి కెళ్లావమ్మా!"

"అవునండి.... మా స్నేహితురాలి పెళ్లికి విజయవాడ వెళ్లాను."

ప్రక్కనున్న కుర్చీలో కూర్చుని ట్రాన్సిస్టర్ ఆన్ చేశాను.

లీలకి ఇరవై రెండు వుంటాయి. చామన చాయగా ఆకర్షణీయంగా వుంది ...

లీల కాఫీ త్రాగుతూనే హోల్డాల్ లోని బట్టలుతీసి "రంగయ్యా.... చాకలికి వేసిరా" అన్నది.

ఆ గది పొందికగా సర్దివున్నది. పరిసరాలని బట్టి వ్యక్తిని చెప్పవచ్చు. డ్రెస్సింగ్ టేబుల్ ప్రక్కనవున్న పుస్తకాల బీరువా నన్ను ఆకర్షించింది.

"మీవి కూడ బట్టలువుంటే వెయ్యండి బాబయ్యగారూ!"

"నావేం లేవమ్మా.... నీకు మంచి పుస్తకాల అభిరుచి వుందే."

లీల మందహాసం చేసింది. "చూడండి నా లైబ్రరీ."

పది నిముషాలు తచ్చాడి బ్లాక్ ఫనధర్ ఆఫ్ శివనపల్లితీశాను. లీల దూరంగా నిలబడి వున్నది. అసలే ప్రయాణం చేసి వచ్చింది అలసటగా వుంటుంది. నేనెందుకు అవస్థపెట్టాలి

"స్నానం చెయ్యమ్మా .... ఆనక మాట్లాడుకుందాంలే...."

పన్నెండు గంటలకి లీల మేడమీదకి వచ్చింది.

"రండి బాబయ్య గారూ భోజనం చేద్దాం."

"నాన్నని రానీయవమ్మా."

"భలే.... ఆయనకి భోజనం యింటి దగ్గరే చెయ్యాలన్న నియమం లేదు."

"వాడు వెయ్యిళ్ళ పూజారి."

ఈ నాల్గు రోజులు వంటరిగా గడిపానేమో ... లీల కంపెనీలో ఈ రోజు ఉషారుగా వుంది.

ఆమె ఆత్మీయభావం నాకు చాల నచ్చింది. మాట్లాడినంతసేపు ఏదో మధురానుభూతి.

కబుర్లతో భోజనాలు అరగంట పైన పట్టినాయి.

మబ్బుగా వుండటం వల్ల ఆ మధ్యాన్నం నాకు మంచి నిద్ర పట్టే సింది. మెలకువ వచ్చేసరికి మూడు దాటింది. దాహంగా వుంది. కూజాలో నీళ్ళులేవు.

"రంగయ్యా" వరండాలోకి వచ్చి పిలిచాను. మెట్లదగ్గరకి లీల వచ్చి "ఏం బాబయ్య గారూ.... మంచినీళ్ళు కావాలా," అడిగింది.

"అవు నమ్మా...."

లీల మంచినీళ్ళు యిస్తూ "మీకు మంచినిద్ర పట్టింది..... రెండు సార్లు వచ్చాను.....మీరు లేవలేదు...."అన్నది.

ఆమె నా కోసం శ్రమతీసుకోవడం కష్టమని పించింది. "రంగయ్య చేత పంపలేక పోయావమ్మా"

"ఫర్వాలేదండి.... పేపరు వచ్చింది. రంగయ్య చేత పేపరు, టీ పంపిస్తాను"

లీల వెళ్ళిపోయింది.

నాలుగున్నరకి బట్టలు మార్చుకుని క్రిందకి వచ్చాను. నిశ్శబ్దంగా వుంది. సోఫాలో కూర్చుని కమలకి ఉత్తరం రాసి పడేశాను. త్వరలో రావడానికి ప్రయత్నిస్తా నన్నాను. జవాబు రాయమన్నాను.

"చిన్నమ్మగారు తోటలో వున్నారయ్యా" రంగయ్య చెప్పాడు.

లీల నాకు కుర్చీ చూపించింది.

చల్లటి పైరుగాలి వీస్తున్నది. కాలువ మీద నుంచి లొల్లాయి పాటలు వినిపిస్తున్నాయి. పశ్చిమం చిట్లిన గాజుల్లా వుంది.

"తోట బాగుందమ్మా....ఇది నీ కృషి అయివుండాలి."

"ఏదో సరదాకి బాబయ్య గారూ! ఏ పని లేకపోతే పిచ్చెక్కుతుంది."

బి. యె. తో ఆపేశావేం? యం. ఏ. కెళ్ళవా?"

"లిటరేచర్‌తో ప్రయివేటుగా అప్పియర్ అవుతున్నానండి. నిన్నే ఫీజుకూడ కట్టేశాను."

సంభాషణ బరువుగా, గొలుసులా సాగుతోంది.

"మీనాన్న యింకా నీ పెళ్ళి విషయం గుర్తించక పోవడం నాకు మంచిదిగా తోచలేదమ్మాయ్....ఊళ్ళో పనులన్నీ మీదేసుకుంటున్నాడు గాని, స్వంతపని చూసుకోడం లేదు....."

లీల దెబ్బతిన్నట్లు చూసింది. కళ్ళలో బెదురు స్పష్టంగా కనబడింది. నేను కంగారు పడ్డాను.

"లీ .. లా"

" ........ "

"అయాం సారీ!" లీల అప్రతిభురాలై పోయినందుకు నొచ్చుకున్నాను.

లీల నిద్రనుంచి లేచినదానిలా తలూపుతూ "సారీ బాబయ్య గారూ! మీరు నన్నేం నొప్పింప లేదు. మీ మీద నా కాత్మీయమైన భావముంది. అంతా చెప్పాలను కుంటున్నాను. కాని ఎలా చెప్పాలో తెలియడం లేదు" అంటూ అటు ఇటు కదలుతున్న కుర్చీని కాస్త ఎడంగా వేసుకుంది.

"అంటే పెళ్ళయిందన్న మాట. వెంకట్రావు శుభలేఖ ఎందుకు పంపలేదా అని ఆలోచిస్తున్నాను."

"ఆ....మాది లవ్ మారేజి"

లీల సాహసానికి ఆశ్చర్యం వేసింది.

"ఆల్సో ఇంటర్ కాస్ట్...."

"మీ నాన్న ఒప్పుకున్నాడా?" నాకు తెల్సు. వెంకట్రావు నమ్మకాలు, ఆశయాలు. పాత తరాన్ని అంటి పెట్టుకున్న మనిషి! ఒక్క సారి అతడిలో యింత తెగింపెలా వచ్చింది? ఆచారాలు, పురాణాలు, బంధు వర్గాలు, అతడి రిజిడ్ ప్రిన్సిపిల్స్ ఎలా ఒప్పుకున్నాయి? సంఘం గీసిన గీతని ఎలా దాట గలిగాడు.

పావుగంట దాకా శ్రోతనయ్యాను. లీలకి సత్యమూర్తికి కాలేజీలోనే పరిచయం ఏర్పడింది. కాని అందరిలా కాకుండా వివాహంతో తమ బంధాన్ని పటిష్టం చేసుకోవా లనుకున్నారు. ముందర లీల భయ

పడింది తండ్రి ఏమంటాడోనని. ఎంచేతనంటే సత్యమూర్తి పెద్ద ఆస్తి పరుడేం కాడు. గౌరవంతో బ్రతుకుతున్న సామాన్య కుటుంబాన్నుంచి వచ్చినవాడు. కాని లీల భయాన్ని వమ్ము చేస్తూ వెంకట్రావు పెళ్లి కొప్పు కున్నాడు. కులం దగ్గర తన పేచీ ఏమీ లేదన్నాడు. అట్టహాసంగా పెళ్ళి చేశాడు.

సత్యమూర్తి 'లా' పూర్తిచేసి రాజమండ్రిలో ప్రాక్టీసు ప్రారంభించాడు. అప్పుడే లీలకి ఆరోగ్యం తరచుగా పాడయ్యేది. క్రొత్త సంసారం; మందులు, డాక్టర్ బిల్లులు, ఎదిగీ ఎదగని ప్రాక్టీసు.

"మా నాన్నని సాయం చెయ్యమని అడుగు తానండీ" అన్నది లీల ఓ సారి.

సత్యమూర్తి పెద్ద ఎత్తున లేచాడు. "నన్నప్రయోజకుడి క్రింద జమకట్టావన్న మాట" అంటూ.

అప్పట్నుంచీ తరచు ఏవో చిన్నచిన్న పేచీ లొచ్చి వెంట వెంటనే సర్దుకుని పోయేవి. ఓ సారి వెంకట్రావు కూతురింటికి వెళ్లాడు.

లీల, సత్యమూర్తి వాగ్యుద్ధంలో వున్నారు. వెంకట్రావు కూడా అందులో జోక్యం చేసుకుంటూ అల్లుడ్ని కేకలేశాడు. దాంతో సమస్య మరీ జటిల మయింది. కూతుర్ని తనతో వచ్చేయమన్నాడు.

లీల అందుకు ఒప్పుకోలేదు.

వెంకట్రావు అప్పట్నుంచి లీల పేర ప్రతి నెలా మూడు వందలు యం. ఓ. చేస్తుండే వాడు. లీల పుట్టింటి నుంచి సొమ్ము తీసుకోడం సత్యమూర్తి కిష్టంలేదు. అప్పట్నుంచీ సరిగ్గా యింటికి రాకపోడం, లీలమీద చెయ్యి చేసుకోడం దాకా వచ్చింది. ఇదంతా వెంకట్రావు తెల్సుకుని వెంటనే బయలుదేరి వచ్చాడు.

సత్యమూర్తిని చెడామడా తిట్టాడు. మాట మీద మాట పెరిగింది. "కులం తక్కువ బుద్ధులు ఎక్కడికి పోతాయి?" అంటూ లీలని తీసుకు వచ్చేశాడు వెంటనే!

ఇది జరిగి రెండేళ్ళయింది.

"మీ నాన్న తొందరపడ్డాడమ్మా? తర్వాత కలవడానికి నువ్వు పయత్నించలేదా?"

నిరాశగా అంది. "విరిగిపోయాక వెన్న ఎక్కడున్నించి వస్తుందండీ! రెండు మూడు సార్లు నేనే వెళ్లాను. ఆయనకి నాన్న మీద గుర్రుగా వుంది. ఆయన స్వయంగా వచ్చి క్షమార్పణ చెప్పాలట."

"మరి మీ నాన్నేం అంటాడు?"

"ఆయనసంగతి మీకు తెల్సుగా . ఆయన ఎక్కువగా ఎవరితోనూ ముఖ్యంగా యింట్లో వాళ్ళతో ఏమీ మాట్లాడరు. ఈ యింట్లో ఎవరి, దారి వారిది? రక్తసంబంధం వున్నా మనుషుల్లో ట్రాన్స్‌పోర్టు వాతావరణం కనబడుతుంది."

ఆ రాత్రి నా ఆలోచనలన్నీ లీలమీదే కేంద్రీకరింపబడ్డాయి.

* * *

ఆ రోజు బాగా ముసురు పట్టింది వాన రాకపోయినా చలిగాలి వీస్తూ చీదరగా వుంది. చైతన్యంలేని ప్రకృతిలో పల్లె స్తంభించి పోయినట్లుంది. ఆ రోజు వెంకట్రావు ఎక్కడికీ పోలేదు. సాయంత్రందాకా నాతోటే గడిపాడు. రాజకీయాలు, చిన్ననాటి ముచ్చటలు మాలో చోటు చేసుకున్నాయి. అతడు జాగ్రత్తగా ఒక పరిధిలో మాట్లాడ్డం గమనించాను. వెంకట్రావు నన్ను పిలిచినా, నాతో ముఖాముఖీ ఏం చెప్పలేదు. లీల విషయం అడుగుదామను కున్నా కాని. బాగా ఆలోచించి ఆగిపోయాను? ముందరే నేను నోరు తెరవడం ఎందుకు?

నాలుగింటికి వెంకట్రావు "లేరా! అలా మిల్లు దగ్గరకి పోదాము" అంటూ లేపాడు. నాకూ కాస్త తిరిగి రావాలని వుంది.

దారిలో వెంకట్రావు ప్రసంగం మిల్లుకి పరిమితమైంది. నాలుగేళ్ళకి లీజుకి తీసుకున్నాడట. మంచి లాభాలు రాకపోయినా, ఏదో తోసుకు పోతున్నదట.

మిల్లు దగ్గరకు వచ్చేటప్పటికి రెండు లారీలు ధాన్యం వచ్చి ఆగివుంది. పది పన్నెండు మంది లారీల దగ్గర నిలబడి వున్నారు.

నన్ను ఆఫీసు రూంలో విడచి వెంకట్రావు లారీల దగ్గరకి పోయాడు. గుమస్తా ఎకౌంటు పుస్తకాలు దీర్ఘంగా తిరగవేస్తున్నాడు.

పది నిముషాలు అలాగే కూర్చున్నాను. గుమస్తాని కబుర్లలోకి దించుదా మనుకున్నాను గాని, అతడి పని పాడుచెయ్యడం ఎందుకనిపించింది. లోపల కాసేపు తిరిగి వద్దామని బయలుదేరాను.

ఆ దృశ్యం చూసి ఆగిపోయాను.

మిల్లుకి అవతల వైపున వెంకట్రావు తోలుకర్రతో ఎవడ్నో కొడుతున్నాడు. అతడు అరుస్తున్నాడు. చుట్టూ జనం మూగి వున్నారు.

"రాస్కెల్! చంపేస్తా.... నాకు తెలియకుండా ఎన్ని రోజులున్నించి సాగిస్తున్నావ్? ఈ రోజు దొరికావు." అంటూ బాదుతున్నాడు.

వెంకట్రావులోని దానవుడు స్పష్టంగా కనిపించాడు.

బీడీ కాల్చుకుంటూ మిల్లులోకి పోతున్న వ్యక్తిని ఆపి "ఏమిటని" అడిగాను.

"వాడు నైట్ వాచరండీ. అరిగిపోయిన బేరింగ్ చెక్కలు తీసి పడేస్తే రూపాయికి ఎవరికో అమ్మాడుట" అంటూ రెండడుగులు వేసి, "కక్కుర్తిపడడూ! జీతం ఎప్పటికీ పెంచడాయె" సణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

వెంకట్రావు కొట్టడం ఆపేశాడు. తిడుతున్నాడు, కాని నాకు వెంకట్రావుని కల్సుకోవాలనిపించక, ఆఫీస్ కేసి నడచాను.

కిటికీలో నుంచి గుమస్తాతో ఓ లావుపాటి మనిషి మాట్లాడుతూ వుండటం చూశాను. ఎందుకో అక్కడే ఆగిపోయాను.

"సేటుగారూ! నాతో అన్నిసార్లు చెప్పాలా! 500 బస్తా వచ్చినట్లు ఎకౌంటూ, స్టాకూ చూపించనూ!" గుమాస్తా తగ్గు స్వరంతో అంటున్నాడు.

"ఆ 50 ఊకబస్తాలూ...." సేటు ఆగాడు.

"బ్రహ్మ పట్టుకోలేడు. అవీ ధాన్యం క్రింద జమే. నా వెయి మాట....?"

"నిన్ను అన్యాయం చేస్తానా ?"

దూరంనుంచే వెంకట్రావు పలకరించాడు.

"ఏరా! యిక్కడ నుంచున్నా వేమిటి ?"

నేను అసలు విషయం చెప్పేద్దామనుకున్నా కాని వాళ్ళిద్దరూ పేటు ఫిరాయిస్తే.... ?

ఎనిమిదయ్యే దాకా అక్కడే వుండి పోయాము. వెంకట్రావు మిల్లుకు సంబంధించిన వ్యవహారాలు గుమాస్తాతో చర్చిస్తూ, పుస్తకాలు లెక్కచూసుకున్నాడు. కాని నాకు ఒక్క విషయం తెల్సింది. గుమస్తా మీదే వెంకట్రావు ఆధారపడి వున్నాడని తెల్సింది. గుమస్తామాట వేదాక్షరం. అతడు ఎంత చెబితే అంత వెంకట్రావుకి.

నాలుగురోజులు ఆనందంగా గడిచి పోయాయి. వెంకట్రావు పెద్ద ఎత్తున లక్ష్మీపూజ చేయించాడు. అన్నివర్గాల వారికి ఉదాత్తమైనవి విందిచ్చాడు. వెంకట్రావుభార్య ఎందుకు రాలేదా అన్న ప్రశ్న వేధించింది. లీలని కలుద్దా మన్నా ఈ హడావుడిలో వుంది. రంగయ్యనే అడిగాను.

"ఏంటోనండిబాబూ! పెదబాబుగార్ని చూస్తూంటే నాకు మతి పోతూంటుంది. అన్నిటా తన పంతమే నెగ్గాలంటారు. ఆ పార్వతమ్మ గనుక ఓర్పుగా యిన్నాళ్ళు వుంది. మరొకామె అయితే వెంటనే విడిచి పారిపోను ఆయమ్మ తన పుట్టింటి వారికి అన్నీ పంపిస్తుందని అయ్య గారికి కోపం. పార్వతమ్మగారి పుట్టింటివాళ్ళు కూడా ప్రక్కవూర్లోనే వున్నారండీ! వాళ్ళదీ చితికిపోయిన సంసారం .... ఆయమ్మ ఆదుకొని కాస్త సాయంచేస్తే మాత్రం ఏమిటి చెప్పండి?"

"నిజమే ...."

"ఆయన అసలుకారణం వేరులెండి. ఆ మధ్య ఎలక్షన్సులో బావమరదిగారిని మెంబరుగా నిలడమన్నారు. ఆయన "నా కెందుకు బావా ఈ రాజకీయాలు ప్రయివేట్లు చెప్పి బ్రతికేవాడ్ని" అని వించోలేదు .... అదీ అసలుగుర్రు ...."

ఆ సాయంత్రందాకా వెంకట్రావుని గురించి ఆలోచిస్తూనే వున్నాను. ఏమిటీ మనిషి? ప్రతిసమస్యని యింతగా పెంచుకుంటున్నాడు. అతడి ఉద్దేశ్యం ఏమైవుంటుంది? పార్వతమ్మ చితికిపోయిన తన వాళ్ళని కాస్త ఆదుకోవడంలో దోషమేమీలేదు. అంతమాత్రానికే కస్సుమని 'నీ పుట్టింటికే పో' అని గెంటేయాలా? ఇలా అన్నిటినీ మెడకేసుకున్నంత మాత్రాన అతడికిదక్కే ఆనందం ఏమిటి? ఇల్లాలులేని యిల్లు ఎంత బోసిపోయివుంది. వెంకట్రావు చాల నిర్లక్ష్యంగా బ్రతికేస్తున్నాడు.

సాయంత్రం లీలని పిల్చి అడిగాను.

"నువ్వేనా అమ్మని తీసుకురాలేవా! లీలా?"

లీల ముందర నిశ్చేష్టిత అయింది. రెండుసార్లు అమ్మేవచ్చిందండీ. మామయ్య వచ్చికూడా బ్రతిమాలేరు. కాని నాన్న ఒప్పుకోలేదు."

"ఏం?"

లీల నవ్వింది. 'అది' దేముడికే తెలియాలి?

క్రింద ఏదో కొత్త కంఠం వినవస్తోంది. "ఎవరు లీలా? అడిగాను.

"దేశ సంచారంచేసి అన్నయ్య దిగాడు. పదేసిరోజులకి ఏదో విధంగా డబ్బు సంపాదించి అటు — ఇటు తిరిగి వస్తాడు. ఇది మాకు మామూలే లెండి. రంగయ్య టీ పెడుతున్నాడు. మీకక్కడ పంపిస్తాను." అంటూ వెళ్ళిపోయింది.

ఓ అరగంటపోయాక క్రిందకి వచ్చేటప్పటికి వెంకట్రావు, కొడుకూ ఘర్షణ పడుతున్నారు.

"నోర్ముయ్ వెధవా! ఇంకా సిగులేక పోతే సరి. అయిదువందలూ తగలేసి మళ్ళీ తయారయ్యావు. అంత దొంగతనంగా కొబ్బరికాయలు అమ్మవలసిన పని నీకేం వచ్చింది? చదువు లేకపోయినా పెకుక మాత్రం వుంది.?"

"డబ్బుకావాలని నిన్ను ముందు అడిగాను. ఒక్కసారి కాదు .... పదిసార్లు. కాని నువ్వు యివ్వలేదు. నేను ఏది చేస్తానన్నా .... 'వద్దూ' అంటూ అడ్డువస్తావ్? చదువు రాకపోతేనేం, మనిషి యింకా అనేక విధాలుగా బ్రతకొచ్చు" సూరిబాబు గట్టిగానే సమాధానం చెప్పాడు.

"నువ్వు పైకిరావని కాగితం రాసిస్తారా? నీలాంటి వెధవలందరూ పైకివస్తే దేశం అడుక్కుతింటుంది. చచ్చుకబుర్లు చెప్పక?"

"ఏం వ్యాపారంచేసే తెలివితేటలు నాకూ ఉన్నాయి. అసలు నాకు డబ్బివ్వడం నీకిష్టంలేదు. అందుకే ఈ నాటకమంతా? దాన్ని ఏనాడో కనిపెట్టాను. అందుకే దౌర్జన్యంగా వసూలు చేస్తున్నాను."

వెంకట్రావు పెద్దగా అరచాడు. "దౌర్జన్యంకాదురా .... దొంగతనం .... అలా ఏడు"

సూరిబాబు వికటంగా నవ్వుతూ "ఆల్‌రైట్ .... ఏదన్నా నాకు

బాధలేదు నా అవసరం తీరడం ముఖ్యం" అనేసి పెద్దగా అంగలేస్తూ లోపల కెళ్లి పోయాడు.

* * *

వెంకట్రావు నాతో ఏం చెప్పకపోయినా అన్నీ గ్రహించాను. అతడిగ్గానికి విరుగుడు అతని చేతిలోనే వుంది. కాని పునరాలోచించుకుని పరిస్థితుల్ని చక్కపెట్టుకునే నేర్పు వెంకట్రావు దగ్గరలేదు. అతడి దర్పే అతడ్ని అలా చేసింది. ఒకవిధమైన మంకుతనం అబ్బింది. ఎల్లప్పుడూ తన చెయ్యే పైన వుండాలని అతడి కోరిక. కాని మనిషిగా, యిది అసాధ్య మని, రకరకాల చిక్కుల్ని తెచ్చి పెడుతుందని అతడికి తెలియదు.

గంట ఎనిమిదవుతుంది. ప్రాతః కాలపు సూర్యుడు బంగారు ముద్దలా మెరిసి పోతున్నాడు. వర్షంనిండిన నేల ఎండలో ముత్యంలా మెరుస్తున్నది.

వెంకట్రావు, నేను వసారాలో కూర్చుని టిఫిన్ తీసుకుంటున్నాము. పార్వతమ్మ మరో రెండిడ్లీ నా విస్తరిలో వెయ్యబోతోంది.

"వద్దమ్మా" అన్నా వినలేదు.

నేనే సాహసంచేసి పార్వతమ్మని తీసుకు వచ్చాను. వెంకట్రావు ధుమ ధుమలాడక పోయినా, చిరాకుగా ముఖం పెట్టాడు. ఆ పని అతడి కిష్టంలేదని తెల్సిపోతోంది. కాని నన్ను కాదనే ధైర్యం లేదతడికి.

"వెంకట్రావు! మనం ఒక పని చేస్తున్నప్పుడు కాస్త ఆలోచించాలి. రాబోయే పరిణామాల్ని ఊహించాలి. చూడు.... ఇంటికి ఇల్లాలన్నారు. ఇవాళ ఎంత నిండుగా వుందో.... ఇల్లనేది సత్రవు, హోటలుకాదు ఆత్మీయత, ప్రేమ అగుపడే దేవాలయం. ఏదో చిన్న

కారణాన్ని పురస్కరించుకుని, ఆమెని పొమ్మని, నిన్ను నువ్వే అన్యాయం చేసుకున్నావు. నీ మనస్సుకి శాంతినిచ్చి, నిన్ను ఓదార్చే మనిషిని దూరం చేసుకుని లేని బాధ కొని తెచ్చుకున్నావు ?"

వెంకట్రావు మరి మాట్లాడలేదు. ప్రసన్నంగా లేకపోయినా మరీ అప్రసన్నంగా లేడు.

నేను పార్వతమ్మకేసి తిరిగి "చూడు చెల్లమ్మా ! ఈ ఇల్లు నీది. మా వాడు కాదన్నా చెల్లదు. ఏదో వాడు కొంత రంకెలేసినా, తర్వాత మళ్లీ పశ్చాత్తాప పడతాడు. కాని దాన్ని ఒప్పుకునేటందుకు నామోషీ. నువ్వే సర్దుకుపోవాలి" చిన్న హితోపదేశం చేశాను.

"ఏరా ! అప్పుడే పోతానంటావు. ఇంకో నాల్గురోజులు వుండ కూడదా ? మీ చెల్లమ్మ విందు రుచిచూద్దువుగానీ" నవ్వుతూ అన్నాడు. వెంకట్రావు.

"మళ్ళీ వస్తాలే ...."

ఇద్దరూ ఎంత బలవంతం పెట్టినా, నెమ్మదిగా తప్పుకున్నాను.

భోజనాలు పూర్తయ్యాక రంగయ్య బండి తోలుకు వచ్చాడు. అందరి దగ్గర మౌనంగా సెలవు తీసుకున్నాను. వెంకట్రావుకూడ బండి ఎక్కాడు.

మువ్వలు చప్పుడు చేసుకుంటూ బండి పరుగిడుతూంది. ....క్షణ క్షణానికి ఊరు దూర మవుతోంది.

"వెంకట్రావ్ ! రెండు రెళ్ళు ఎనిమిదని నిర్ధారణ చేసుకుని లెక్క చేస్తే అది తప్పుతుంది. లీలనికూడ ఏదోలా అత్తారింటికి పంపెయ్. సూరిబాబు ఉత్సాహాన్నికూడ పాడుచెయ్యకు. చిన్న మొత్తంతో ఏదో వ్యాపారం చెయ్యనియ్యి"

వెంకట్రావు ఏదో మాట్లాడ బోయాడు.

"ఆగరా! నన్ను చెప్పనీ! నువ్వెంతసేపు పెద్ద విషయాన్ని ఉపేక్షచేసి, చిన్న విషయాన్ని సాగదీస్తావు. చిన్నప్పుడు చదువుకున్న సామెత—"పెన్నీ వైజ్ అండ్ పౌండ్ ఫూలిష్ నీపట్ల నిజమవుతోంది."

వెంకట్రావు కళ్ళు వాలిపోయినయి. బండి రోడ్డుమీదకి వచ్చి ఆగింది. బస్సు సిద్ధంగా వుంది.

